సాక్షి కామారెడ్డి

మంగళవారం । 16 । సెప్టెంబర్ । 2025



ఫిర్యాదులను పరిష్కరించాలి

ప్రజావాణిలో నమోదైన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులకు సూచించారు.

- 8లో ▸



అదే గోస

జిల్లాలో యూరియా కష్టాలు కంటిన్యూ అవుతున్నాయి. బస్తా ఎరువు కోసం అన్నదాతలకు తిప్పలు తప్పడం లేదు.

- 9లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
35.9 /21.9

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. అక్కడక్కడ ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలి



కామారెడ్డి టౌన్: సీనియర్ ఉపాధ్యాయులు టెట్ పరీక్ష క్వాలిఫై కావాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు సబబు కాదని, దీనినుంచి మినహాయింపు ఇవ్వాలని తపస్ ప్రతినిధులు కోరారు. సోమవారం తపస్ జిల్లా అధ్యక్షుడు పుల్గం రాఘవరెడ్డి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ చందర్‌నాయక్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. 15 ఏళ్ల అనుభవం ఉన్న ఉపాధ్యాయులకు టెట్‌నుంచి మినహాయింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఆంజనేయులు, రాజశేఖర్, సత్యనారాయణ, దత్తాచారి, సంతోష్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

బీర్కూర్ సొసైటీ చైర్మన్‌గా ఇంగు రాములు



బాన్సువాడ : బీర్కూర్ సహకార సంఘం అధ్యక్షుడు ఎవరవుతారన్న ఉత్కంఠకు తెర పడింది. సొసైటీ చైర్మన్‌గా ఇంగు రాములును నియమిస్తూ సోమవారం డీసీవో రామ్మోహన్‌రావు ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో చైర్మన్‌గా పని చేసిన గాంధీ అనారోగ్యం కారణంగా పదవికి రాజీనామా చేశారు. ఉపాధ్యక్షుడిగా ఉన్న రాధాకృష్ణను ఇన్‌చార్జి అధ్యక్షుడిగా నియమించారు. అయితే ఆయన సహకార సంఘంలో రూ.1.20 లక్షల విలువ గల ఎరువులను తీసుకుని డబ్బులు చెల్లించకపోవడంతో పదవినుంచి తొలగించారు. దీంతో చైర్మన్ పదవి మళ్లీ ఖాళీ అయ్యింది. ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి వర్గీయుడైన డైరెక్టర్ ఇంగు రాములుతోపాటు మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి వర్గీయుడైన డైరెక్టర్ పోగు పాండు ఇద్దరు చైర్మన్ స్థానం కోసం పోటీపడ్డారు. చివరికి పోచారం వర్గానికి చెందిన రాములునే అధ్యక్ష పదవి వరించింది.

19న విత్తన క్షేత్రంలో పంట ఉత్పత్తుల వేలం

నాగిరెడ్డిపేట: మాల్తుమ్మెద విత్తన క్షేత్రంలో ఈనెల 19న మధ్యాహ్నం పంట ఉత్పత్తులను వేలం వేయనున్నట్లు క్షేత్రం ఏడీఏ ఇంద్రసేన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విత్తన క్షేత్రంలో విత్తనం కోసం ఉపయోగపడని కేఎస్‌ఎం–1638 సన్నరకానికి చెందిన 492 క్వింటాళ్ల ధాన్యం నిల్వ ఉందని పేర్కొన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విత్తన క్షేత్ర కార్యాలయంలో వీటిని వేలం వేయనున్నట్లు తెలిపారు. వేలంపాటలో పాల్గొనేవారు రూ.2 వేల డిపాజిట్ చెల్లించాలని సూచించారు. వేలం తర్వాత నిర్ధారించిన సొమ్ములో సగం డబ్బులను రెండురోజులో చెల్లించాలని, మిగతా మొత్తాన్ని వారంలో చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తిగలవారు వేలం పాటలో పాల్గొనాలని సూచించారు.

నిజాంసాగర్‌లోకి భారీ ఇన్‌ఫ్లో



నిజాంసాగర్: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు సోమవారం రాత్రి 9 గంటల ప్రాంతంలో నిజాంసాగర్ ప్రాజెక్టులోకి 38,829 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు. దీంతో ప్రాజెక్టు 4 వరద గేట్ల ద్వారా 27,128 క్యూసెక్కుల నీటిని మంజీర నదిలోకి వదులుతున్నామన్నారు. ప్రధాన కాలువకు వెయ్యి క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామన్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1,405 అడుగులు(17.8 టీఎంసీలు) కాగా 1,404.72 అడుగుల (17.397టీఎంసీలు) నీరు నిల్వ ఉందన్నారు.

రేపు జాబ్‌మేళా

కామారెడ్డి అర్బన్: కలెక్టరేట్‌లో బుధవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి రజనికిరణ్ ఒక ప్రకటనలో తెలిపారు. హెటిరో ఔషధ కంపెనీలో 40 జూనియర్ ఆఫీసర్ పోస్టులు, 100 జూనియర్ కెమిస్ట్ ట్రైనీ (పురుషులు మాత్రమే) పోస్టులు, 60 జూనియర్ ఇంజినీర్ పోస్టులు భర్తీ చేసేందుకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 90598 88389, 76719 74009 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఆ నలుగురు కరువయ్యారు!



- పాడె మోయడానికి వెనకడుగు
- అయినవారూ దూరంగానే..
- ఏదో కారణం చెప్పి తప్పించుకుంటున్న వైనం
- పుట్టెడు బలగం ఉన్నా అంతిమయాత్రకు తప్పని తిప్పలు

ఒకప్పుడు మృతదేహాన్ని మోయడాన్ని పుణ్యంగా భావించేవారు. ఎవరైనా చనిపోయినపుడు బంధుమిత్రులే కాదు.. ముఖ పరిచయం ఉన్నవారు సైతం అంత్యక్రియల్లో పాల్గొనేవారు. కాసేపైనా పాడెను మోసేవారు. కనీసం ఓ చేయితో పాడెను పట్టుకుని నాలుగడుగులన్నా వేసేవారు. ఇప్పుడు పరిస్థితి మారింది. అంత్యక్రియల్లో పాల్గొనడానికి చాలామంది ఇష్టపడడం లేదు. శవాన్ని మోయడానికి దగ్గరి బంధువులూ ముందుకు రావడం లేదు. దీంతో 'ఆ నలుగురి' కోసం వెతుక్కోవాల్సిన పరిస్థితి దాపురించింది.

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : పెరిగిన సాంకేతికతతో ఓవైపు ప్రపంచమే కుగ్రామంగా మారిపోగా.. మరోవైపు మనుషుల మధ్య మాత్రం దూరం పెరిగిపోతోంది. గతంలో ఎవరో తెలిసిన వారు చనిపోతేనే తల్లడిల్లిపోయిన గుండెలు.. ఇప్పుడు దగ్గరి వారు దూరమైతే కనీసం అంత్యక్రియల్లో పాల్గొనడానికి కూడా ఆసక్తి చూపడం లేదు. మనుషుల్లో పెరిగిన స్వార్థం కావచ్చు, మూఢ విశ్వాసాలు కావచ్చు.. చావు దగ్గరకు వచ్చేసరికి దగ్గరి వాళ్లు సైతం దూరంగా ఉంటున్నారు. ఎంత బలగం ఉన్నా, ఎంతమంది ఆత్మీయులు ఉన్నా అంత్యక్రియలకు వచ్చేవారి సంఖ్య తగ్గిపోతోంది. వచ్చిన వారు కూడా దూరం నుంచే చూసి వెళుతున్నారు. ఏదో కొద్దిమంది మాత్రమే అంత్యక్రియలు అయ్యేదాకా ఆగుతున్నారు. వారు కూడా దూరంగా ఉండి అంత్యక్రియలు ఎప్పుడు పూర్తవుతాయోనని ఎదురు చూస్తున్నారు.

పెరిగిన మూఢత్వం..

ఇప్పుడు మనుషుల్లో తెలియని మూఢత్వం పెరిగిపోయింది. చాలామంది శవం దగ్గరకే రావడం లేదు. దూరం నుంచి కుటుంబ సభ్యులకు ముఖం చూపించి వెళుతున్నారు. మరికొందరు వచ్చామా, వెళ్లామా అన్నట్టుగా ఉంటున్నారు. పాడె మోసేందుకు నలుగురు వ్యక్తులు కరువవుతుండడంతో ప్రతిచోటా శవాలను తీసుకువెళ్లేందుకు వైకుంఠరథాలు అందుబాటులోకి వచ్చాయి. అయితే ఇంటి దగ్గరి నుంచి వైకుంఠరథం దగ్గర దాకైనా మోయాల్సిందే కదా.. అలాగే దింపుడుగల్లం నుంచి వైకుంఠధామం వరకు మోసుకు వెళ్లాల్సిందే కదా.. ఇలాంటి పరిస్థితుల్లో ఆ నలుగురి అవసరం ఎంతో ఉంటుంది. కొన్ని కుటుంబాల్లో శవం మోయడానికి ఎవరూ ముందుకు రావడం లేదు. దీంతో కొన్ని సందర్భాల్లో నలుగురు జమయ్యేదాకా ఎదురు చూడాల్సిన పరిస్థితులు కనబడుతున్నాయి.

విచిత్రమైన కారణాలతో..

దగ్గరి బంధువులు చనిపోయినా సరే కొందరు పాడె మోయడానికి ఏవో కారణాలు చెబుతున్నారు. ఇటీవల జిల్లా కేంద్రంలో ఒక పెద్దాయన చనిపోగా దగ్గరి బంధువు ఒకరు దూరాన నిల్చుని చూస్తున్నాడు. పిలిచినా దగ్గరికి రాకపోవడంతో ఒకాయన అతడి వద్దకు వెళ్లి 'మీ దగ్గరి వాళ్లు కదా.. శవం మోయడానికి ఎవరూ లేరు. నాలుగు అడుగులు మోయరాదే' అని బతిమాలాడు. 'నేను మొన్ననే ఇంటి నిర్మాణానికి గడప ఎక్కించిన. చావుకే వెళ్లొద్దని అందరు అంటున్నా ఇక్కడిదాకా వచ్చిన. శవం మోయద్దటా' అని సమాధానం చెప్పి మెల్లిగా జారుకున్నాడు.
మరో సంఘటనలో ఓ వ్యక్తి శవాన్ని మోయడానికి రావాలని అందరూ పిలుస్తుంటే 'మొన్ననే నా బిడ్డ పెళ్లి అయ్యింది. కాళ్లు కడిగిన. శవం మోయద్దని అంటున్నరు. అందుకే దూరంగా ఉన్న' అని మరణించినతని వంశానికి చెందిన వ్యక్తి సమాధానమిచ్చాడు.
ఇంకోచోట ఓ వ్యక్తి చనిపోయాడు. రోజూ కలిసి తిరిగిన దోస్తు మాత్రం మృతదేహం దగ్గరికి వచ్చి దూరంగా నిల్చున్నాడు. దోస్తు అమ్మా, నాన్నను ఓదార్చడానికి కూడా వెళ్లలేదు. ఇద్దరు రోజూ కలిసి తిరిగేవారు కదా.. ఎందుకు రావడం లేదు అని అడగ్గా.. 'నా భార్య గర్భవతి. ఇప్పుడు శవం దగ్గరకు పోవద్దంట. శవాన్ని మోయద్దంట. అందుకే దూరంగా ఉన్న' అని చెప్పాడు.
కొన్నాళ్ల క్రితం జిల్లాలో ఒకాయన చనిపోతే దగ్గరి బంధువులకు సమాచారం ఇచ్చారు. ఒకాయన రాకపోవడంతో ఆయనకోసం ఎదురుచూడసాగారు. ఫోన్లు చేస్తే సమాధానం ఇవ్వడం లేదు. చివరికి తేలింది ఏమంటే సదరు వ్యక్తి ఇంటి నిర్మాణం పూర్తయ్యింది. మరో వారంలో గృహ ప్రవేశం ఉంది. అందుకే ఆయన అంత్యక్రియలకు రాలేదు. ఇలా ఏదో ఒక సాకుతో దగ్గరివారి అంత్యక్రియల్లోనూ చాలామంది పాల్గొనడం లేదు. చివరి చూపు కోసం వచ్చినా పాడె మోయడానికి ముందుకు రావడం లేదు.

పట్టణాలు, నగరాల్లో మరీ దయనీయం..

గ్రామీణ ప్రాంతాల్లో ఎవరు చనిపోయినా అంత్యక్రియలకు కొంతమందయినా హాజరవుతున్నారు. శవాన్ని మోయడానికి ఇబ్బందులు ఎదురవడం లేదు. అయితే పట్టణాలు, నగరాల్లో అయితే దయనీయమైన పరిస్థితి ఉంటోంది. ఎవరైనా చనిపోతే ఇంటి చుట్టుపక్కల వారు కూడా పట్టించుకోవడం లేదు. బంధువులు వచ్చేదాకా ఇంటి దగ్గర నలుగురు జమ కావడం లేదు. ఏర్పాట్లు చేయాలని ఎవరూ ముందుకు రావడం లేదు. బంధువులు, స్నేహితులు వచ్చినా, ఎంతమంది ఉన్నా కొన్నిసార్లు ఇంట్లో నుంచి శవాన్ని పాడెపై పడుకోబెట్టడానికి కూడా ఎవరూ ముందుకు రావడం లేదు.

ఇంటికొకరు నిబంధన..

అంత్యక్రియల సమయంలో ఎవరూ ఉండకపోవడంతో కొన్ని కుల సంఘాలు కట్టుబాట్లను ఏర్పాటు చేసుకుంటున్నాయి. కొన్ని కాలనీలలో కుల సంఘాలు ఎక్కువగా చావుల కోసమే నిలబడుతున్నాయి. సంఘంలో సభ్యులుగా ఉన్న వారి కుటుంబాల్లో ఎవరైనా చనిపోతే ప్రతి సభ్యుడు తప్పనిసరిగా హాజరు కావాలన్న నిబంధనలు పెడుతున్నారు. చనిపోయిన వ్యక్తి ఇంటి దగ్గర, అంత్యక్రియలకు వెళుతుండగా మార్గమధ్యలో, అలాగే వైకుంఠధామం వద్ద.. ఇలా మూడు, నాలుగుసార్లు హాజరు తీసుకుంటున్నారు. అయితే శవాన్ని మోయాలన్న నిబంధన పెడితే రావడం కూడా తగ్గిపోతుందని ఆ ఒక్కటి మినహాయించినట్టు ఓ కుల సంఘం పెద్దమనిషి 'సాక్షి'తో పేర్కొన్నారు.

ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

- అంగన్‌వాడీ ఉద్యోగుల డిమాండ్
- కాంగ్రెస్ కార్యాలయం ముట్టడి



జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రకాంత్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కామారెడ్డి టౌన్ : ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రూ. 18 వేల కనీస వేతనంతోపాటు పీఎఫ్, ఈఎస్‌ఐ సౌకర్యాలు కల్పించాలని అంగన్‌వాడీ, మినీ అంగన్‌వాడీ టీచర్లు డిమాండ్ చేశారు. ఈ డిమాండ్లతో సోమవారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయాన్ని సీఐటీయూ, అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్ యూనియన్ ఆధ్వర్యంలో ముట్టడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగ విరమణ జీవో నంబర్ 8 సవరణ, ఖాళీల భర్తీ తదితర హామీలను అమలు చేయాలన్నారు. గతేడాది జూలై ఒకటో తేదీనుంచే రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందించాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ ఉద్యోగులకు ఎలాంటి షరతులు లేకుండా ఆసరా పెన్షన్లు ఇవ్వాలన్నారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ ఇంటితోపాటు, పార్టీ కార్యాయాన్ని ముట్టడించామన్నారు. అనంతరం గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ చంద్రకాంత్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు అరుణ్ కుమార్, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి బాబాయి, ప్రతినిధులు లక్ష్మి, యాదమ్మ, సురేఖ, విజయ, సరిత, సుజాత, సునంద, సిద్దమ్మ, లలిత, సురేఖ, రాణి, కవిత, అలివేలు, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా చూడాలి

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం: వ్యాధులు ప్రబలకుండా చూడాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులకు సూచించారు. ముఖ్యంగా జిల్లాలో డెంగీ వ్యాధి ప్రబలకుండా గ్రామాలు, పట్టణాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. కలెక్టరేట్‌లో వివిధ శాఖల జిల్లా అధికారులతో సోమవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. నీటి నిల్వల కారణంగా దోమలు వృద్ధి చెంది డెంగీ, మలేరియా తదితర వ్యాధులు వ్యాపించే అవకాశం ఉంటుందన్నారు. కాబట్టి పారిశుద్ధ్య కార్యక్రమాలు క్రమంతప్పకుండా జరగాలన్నారు. మండల ప్రత్యేకాధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల వేగం పెంచాలన్నారు. మరో రెండు మూడు రోజుల పాటు జిల్లాలో వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. అధికారులు అప్రమత్తంగా ఉండి ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ చందర్ నాయక్, ఆర్డీవో వీణ, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్

పోషణ మాసాన్ని నిర్వహించాలి

కామారెడ్డి క్రైం: పోషణమాసం కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో పోషణమాసం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 17 నుంచి వచ్చే నెల 16 వరకు పోషణమాసం కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. గ్రామస్థాయిలో ప్రతి ఒక్కరికి పోషకాహారంపై అవగాహన కల్పించాలన్నారు. పోషణ లోపంతో ఉన్న పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారి ప్రమీల, డీఆర్డీవో సురేందర్, డీఎంహెచ్‌వో చంద్రశేఖర్, డీఈవో రాజు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

చేప పిల్లలు వచ్చేదెప్పుడో!?

జలాశయాల్లో పుష్కలంగా నీరున్నా..
వానాకాలం సీజన్ ముగింపునకు వస్తున్నా జిల్లాలో ఇప్పటివరకు చేప పిల్లల జాడ లేదు. టెండర్ల ప్రక్రియనే ఇంకా పూర్తి కాలేదు. దీంతో చేపల వేటపై ఆధారపడి జీవిస్తున్న మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు.

- టెండర్లకు ముందుకు రాని కాంట్రాక్టర్లు
- ఆందోళనలో మత్స్యకారులు




నిజాంసాగర్‌లో చేపపిల్లలను విడుదల చేస్తున్న జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు (ఫైల్)

నిజాంసాగర్: రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో చేప పిల్లల సరఫరాకు కాంట్రాక్టర్లు ముందుకు రావడంతో టెండర్ల ప్రక్రియ పూర్తయ్యింది. కానీ కామారెడ్డి జిల్లాలో మాత్రం కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో టెండర్ ప్రక్రియ ముందుకు సాగడం లేదు. చేప పిల్లల కోసం మత్స్యశాఖ అధికారులు టెండర్ ప్రక్రియ చేపట్టినా.. ఒక్క కాంట్రాక్టర్ కూడా ముందుకు రావడం లేదని అధికారులు పేర్కొంటున్నారు. దీంతో జిల్లాలో ఈసారి చేప పిల్లల పంపిణీ ప్రక్రియపై నీలినీడలు అలుముకున్నాయి.

గతేడాది యాభై శాతమే..

జిల్లాలో 768 చెరువులు, కుంటలతో పాటు ప్రధాన జలాశయాలైన నిజాంసాగర్, కౌలాస్ ప్రాజెక్టుల్లో చేప పిల్లలను వదులుతారు. ఆయా చెరువులు, ప్రధాన జలాశయాల్లో 720 మత్స్య సహకార సంఘాల్లో 14 వేల మంది కార్మికులు ఉన్నారు. వారికి ఉపాధి కల్పించేందుకు గతంలో 2.85 కోట్ల చేప పిల్లలను వదిలేవారు. అయితే వివిధ కారణాలతో గతేడాది అందులో యాభై శాతమే చేపపిల్లలను వదిలారు. ఈ ఏడాది నిర్దేశించుకున్న లక్ష్యం మేరకు 2.85 కోట్ల చేప పిల్లలను విడుదల చేయాల్సి ఉంది. కానీ వర్షాకాలం ప్రారంభమై మూడు నెలలు గడుస్తున్నా ఇప్పటికీ చేపపిల్లల జాడ లేదు.

ముందుకు రావడం లేదు



జిల్లాలో 2.85 కోట్ల చేప పిల్లలను సరఫరా చేయాల్సి ఉంది. దీనికి టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. బిల్లులు బకాయి ఉండడంతో కాంట్రాక్టర్లు టెండర్లకు దూరంగా ఉంటున్నారు. టెండర్ల ప్రక్రియ సాగేలా చూస్తాం.

– శ్రీపతి, జిల్లా మత్స్యశాఖ అధికారి, కామారెడ్డి

'బోను ఏర్పాటు చేస్తాం'



మద్నూర్ తహసీల్ కార్యాలయంలో గ్రామస్తులతో మాట్లాడుతున్న అటవీ శాఖ అధికారి సంతోష

మద్నూర్: చిరుత పులి జాడ కోసం గాలిస్తున్నామని, దానిని పట్టుకునేందుకు బోన్‌లు ఏర్పాటు చేస్తామని అటవీశాఖ రేంజ్ అధికారి సంతోష తెలిపారు. మండల కేంద్రంలోని తహసీల్ కార్యలయానికి సోమవారం మద్నూర్ గ్రామస్తులు, రైతులు తరలి వచ్చి చిరుత పులిని పట్టుకోవాలని తహసీల్దార్ ముజీబ్‌కు వినతి పత్రం ఇచ్చారు. అనంతరం తహసీల్ కార్యలయానికి వచ్చిన అటవీశాఖ అధికారులు రైతులతో సమావేశమయ్యారు. పులిని పట్టుకోవడానికి డ్రోన్ కెమెరాలను, బోన్‌లను ఏర్పాటు చేయాలని రైతులు డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని జిల్లా అటవీశాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్తామని ఆమె తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ అధికారి సుజాత, బీట్ అధికారి రాంచందర్, రైతులు బాల్‌కిషన్, రాములు, హన్మండ్లు, పరశురాం, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

'విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి'

కామారెడ్డి టౌన్: తెలంగాణ విమోచన దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నీలం చిన్నరాజులు డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో విమోచన దినోత్సవ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం జాతీయ సమైక్యత దినోత్సవంగా నిర్వహించిందని, ప్రస్తుత సర్కార్ తెలంగాణ ప్రజాపాలన దినోత్సవంగా నిర్వహిస్తోందని, ఇది సరి కాదని పేర్కొన్నారు. సెప్టెంబర్ 17న తెలంగాణ విమోచన దినోత్సవంగానే నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి నరేందర్‌రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ లక్ష్మారెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యుడు విపుల్, పట్టణ అధ్యక్షుడు శ్రీకాంత్, నాయకులు సురేష్, వేణు, సంతోష్‌రెడ్డి, రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు చిన్నరాజులు, పార్టీ నాయకులు

క్లుప్తంగా

18 వరకు రేషన్ బియ్యం పంపిణీ

కామారెడ్డి రూరల్: రేషన్ షాపుల ద్వారా అందజేస్తున్న సెప్టెంబర్ నెలకు సంబంధించిన ఉచిత బియ్యం పంపిణీ ఈ నెల 18 వరకు కొనసాగుతుందని పౌరసరఫరాల శాఖ అధికారులు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. మొదటగా ఈ నెల 15 వరకు చివరి తేదీ అని ప్రకటించగా మరో మూడు రోజులు రేషన్ పంపిణీ గడువు పొడిగిస్తున్నట్లు తెలిపారు.

ఎర్రాపహాడ్‌వాసికి సినారె గజల్ పురస్కారం



తాడ్వాయి(ఎల్లారెడ్డి): ఎర్రాపహాడ్ గ్రామానికి చెందిన కవి కొడి రవీందర్ సినారె గజల్ పురస్కారం అందుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఆదివారం రవీందర్ హైదరాబాద్‌లో కొమ్రరాజు ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన త్యాగరాయ గాన సభలో పాల్గొని పాటలు, కవిత్వం రాశారు. నైపుణ్యం గర్తించి రవీందర్‌కు సినారె గజల్ పురస్కారాన్ని అందజేశారు.

నేడు ఎస్‌జీఎఫ్ జోనల్ స్థాయి క్రీడాకారుల ఎంపిక

గాంధారి(ఎల్లారెడ్డి): మండల పరిధిలోని పేట్ సంగెం జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో మంగళవారం జోనల్ స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడాకారుల ఎంపిక జరుగుతుందని ఎంఈవో శ్రీహరి, పీఈటీ లక్ష్మణ్ రాథోడ్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. వాలీబాల్, కబడ్డీ, ఖోఖో క్రీడల్లో అండర్–14, అండర్–17 విభాగాల్లో పోటీలు నిర్వహించి ఒక్కో విభాగం నుంచి ముగ్గురు క్రీడాకారులను ఎంపిక చేయనున్నట్లు వారు వెల్లడించారు.

బాలాజీ జెండా వద్ద అన్నదానం

మద్నూర్(జుక్కల్): మండల కేంద్రంలో కొలువుదీరిన తిరుమల తిరుపతి బాలాజీ జెండా వద్ద మంగళవారం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు సోమవారం నిర్వాహకులు డాక్టర్ రమణ తెలిపారు. మధ్యాహ్నం బాలాజీ జెండా వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తామన్నారు. అలాగే బుధ, గురువారం రెండు రోజుల పాటు ఈ సారి మండల కేంద్రంలో బాలాజీ జెండా ఊరేగింపు కార్యక్రమం ఉంటుందని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ఈ–పంచాయతీ ఆపరేటర్ సోమిరెడ్డికి నివాళి



రాజంపేట: సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలంలో ఈ–పంచాయతీ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్న సోమిరెడ్డి ఈ నెల 12 రైలుకి ఎదురెళ్లి ఆత్మహత్య చేసుకోవడంపై మండల ఈ–పంచాయతీ ఆపరేటర్లు సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మండల పరిషత్ కా ర్యాలయంలో సోమిరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీడీవో బాలకృష్ణ, ఎంపీవో రఘురాం, ఆపరేటర్లు చంద్రప్రసాద్, ప్రవీణ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఫాగింగ్... పరేషాన్..!

దోమకాటుకు పల్లెలు విలవిల

- మూలన పడిన యంత్రాలు
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ
- ఫాగింగ్ చేస్తే అప్పులు..చేయకుంటే దోమలు పెరుగుతున్నాయంటున్న కార్యదర్శులు



బాన్సువాడ రూరల్: దోమకాటుతో గ్రామీణులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దోమల నివారణకు గత ప్రభుత్వ హయాంలో డబ్బులు వెచ్చించి కొనుగోలు చేసిన ఫాగింగ్ మెషిన్లు చాలా పంచాయతీల్లో చెడిపోగా మరికొన్ని చోట్ల మిషన్లను వినియోగించడం లేదు. దీంతో డెంగీ, మలేరియా, టైఫాయిడ్‌తో పాటు ఇతర వైరల్ జ్వరాలు తాండవం చేస్తున్నాయి. గత ప్రభుత్వం ఒక్కో యంత్రానికి రూ.35 వేల నుంచి 40 వేలు వెచ్చించి ఫాగింగ్ మెషీన్‌లను కొనుగోలు చేసింది. కొన్ని మేజర్ పంచాయతీల్లో పారిశుద్ధ్య కార్మికులతో పంచాయతీ కార్యదర్శులు ఫాగింగ్ చేయిస్తున్నారు. కొన్ని పంచాయతీల్లో యంత్రాలు చెడిపోవడంతో పక్కనున్న పంచాయతీల నుంచి తీసుకుని రావాల్సిన దుస్థితి నెలకొంది. ఇటీవల స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమంలో భాగంగా ఫాగింగ్ యంత్రాలకు మరమ్మతులు చేయించాలని అధికారులు సూచనలు చేసినప్పటికీ పంచాయతీల్లో నిధులు లేకపోవడంతో ఏమీ చేయలేని పరిస్థితి నెలకొంది. డీజిల్, పెట్రోల్, లిక్విడ్‌లను సమ పద్ధతుల్లో వినియోగించకపోవడంతో యంత్రాలు చెడిపోయినట్లు తెలుస్తోంది.

ఖర్చు తడిసి మోపెడు..

మండలంలోని చాలా గ్రామాల్లో ఫాగింగ్ యంత్రాలు మరమ్మతులు చేయించలేక మూలన పడేశారు. గ్రామ పంచాయతీల్లో నిధులు లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని పంచాయతీ కార్యదర్శులు పేర్కొంటున్నారు. ఒక్కో మేజర్ పంచాయతీలో ఒకసారి ఫాగింగ్ చేయించాలంటే రూ.7 వేల నుంచి 10 వేలు ఖర్చవుతాయి. ఇప్పటికే ఒక్కో కార్యదర్శి రూ.2 లక్షల నుంచి 4 లక్షల వరకు అప్పుల పాలై అభివృద్ధి పనులు చేయించారు. గ్రామాల్లో ఫాగింగ్ చేయకపోతే దోమలు పెరుగుతాయి.. చేస్తే పంచాయతీ కార్యదర్శులకు అప్పులు పెరుగుతున్నాయని వాపోతున్నారు.

దోమల స్వైరవిహారం..

గ్రామ పంచాయతీల్లో వారంలో రెండు సార్లు ఫాగింగ్ చేపట్టాల్సి ఉంటుంది. వర్షాకాలం సీజన్ కావడంతో వీటి వినియోగం మరింత ఎక్కువ చేసినప్పుడే దోమలను సగం వరకు నియంత్రణ చేయవచ్చు. గ్రామం మొత్తంగా నెలలో ఒక్కసారి కూడా ఫాగింగ్ చేయడం లేదు. ఒకసారి పిచికారి చేయించిన ఫొటోలనే మార్చి మార్చి ప్రతినెలా వినియోగిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

ఆదేశాలు జారీచేస్తాం

ప్రతి గ్రామంలో దోమల నివారణ కోసం మందును పిచికారీ చేయాలని కార్యదర్శులకు సూచనలు ఇచ్చాం. కొన్ని గ్రామాల్లో ఫాగింగ్ మిషన్లు పాడైనట్లు కార్యదర్శులు చెబుతున్నారు. వాటికి మరమ్మతులు చేయించి ఉపయోగంలోకి తెచ్చేలా చర్యలు తీసుకుంటాం. వర్షాకాలంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఉండటంతో పారిశుద్ధ్య నిర్వహణను నిరంతరం పర్యవేక్షిస్తున్నాం.

– సత్యనారాయణరెడ్డి, డీఎల్‌పీవో, బాన్సువాడ

యూరియా బస్తా తెచ్చిన తంటా!

యువ రైతుకు అవమానం..

భిక్కనూరు: వరిపంట చిరు పొట్ట దశకు వచ్చింది. ఎక్కడా పంటకు యూరియా దొరకడం లేదు. ఓ పొలంలో కనిపించిన యూరియా బస్తాను తీసుకెళ్లాడు. ఈ పని ఆ రైతును తీవ్ర ఇబ్బందుల పాలు చేసింది. వివరాలు ఇలా ఉన్నాయి. సోమవారం కామారెడ్డి జిల్లా భిక్కనూరు మండలం రామేశ్వర్‌పల్లి గ్రామానికి చెందిన రైతు తక్కళ్ల గంగారెడ్డి తన వరి పంటకు అవసరమైన రెండు ఎరువుల బస్తాలను క్యూలైన్‌లో గంటల తరబడి నిలబడి కొనుగోలు చేశాడు. మొదట తన వాహనంపై ఒక యూరియా బస్తాను తీసుకెళ్లి తన వ్యవసాయ క్షేత్రంలో పెట్టాడు. ఇంకో బస్తాను తీసుకొచ్చేందుకు వెళ్లాడు. అదే సమయంలో ఆ రోడ్డు వెంబటి బైక్‌పై వెళ్తున్న ఇద్దరు యువకులు వ్యవసాయ క్షేత్రంలో యూరియా బస్తాను గమనించారు. అందులో ఓ యువకుడు తన పంట చిరు పొట్ట దశకు వస్తున్నదని, చల్లేందుకు యూరియా దొరకడం లేదని తన స్నేహితునికి పరిస్థితిని వివరించాడు. దీంతో ఇద్దరు యువకులు కలిసి యూరియా బస్తాను బైక్ పై పెట్టి, అది కనిపించకుండా మక్క కంకుల చొప్పను కప్పి తీసుకెళ్లిపోయారు. ఇదిలా ఉండగా తన పొలం వద్దకు తిరిగి వచ్చిన గంగారెడ్డి యూరియా బస్తా కనిపించకపోవడంతో చుట్టుపక్కల వారిని విచారించాడు. ఇద్దరు యువకులు బైక్‌పై బస్తాను తీసుకెళ్తుండగా తాము చూశామని చెప్పడంతో వెంటనే భిక్కనూరు టోల్‌ప్లాజా వద్దకు చేరుకుని సీసీ పుటేజీని పరిశీలించాడు. మక్క కంకుల చొప్పచాటున యూరియా బస్తాను యువకులు తీసుకెళ్తున్న ఫొటోలు తీసుకుని అన్ని సోషల్ మీడియా గ్రూపుల్లో షేర్ చేశాడు. మరోవైపు యూరియా బస్తాను తీసుకెళ్తున్న యువకులు అంతంపల్లి గ్రామ శివారులో బస్టాండ్ వద్ద మూత్ర విసర్జనకు వాహనాన్ని నిలిపారు. అంతలోనే వారి మిత్రులు ఫోన్ చేసి మీరు యూరియా బస్తాను ఎత్తుకెళ్తున్నారని సోషల్ మీడియాలో ఫొటోలతో సహా వైరల్ అవుతోందని సమాచారమిచ్చారు. కంగారు పడిన యువకులు వెంటనే తమ గ్రామస్తులకు విషయాన్ని తెలిపారు. తమ గ్రామానికి వెళ్లి జరిగిన సంగతిని గ్రామపెద్దలకు వివరించారు. వెంటనే గ్రామపెద్దలు ఈ విషయాన్ని రైతు గంగారెడ్డి సొంత గ్రామమైన రామేశ్వర్‌పల్లి గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మద్ది సూర్యకాంత్ రెడ్డికి వివరించారు. యూరియా బస్తాతో ఇద్దరు యువకులను రామేశ్వర్‌పల్లికి తీసుకొచ్చారు. రామేశ్వర్‌పల్లి గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు యూరియా బస్తాను పోగొట్టుకున్న రైతు గంగారెడ్డితోపాటు పలువురు నేతలను గ్రామపంచాయతీ వద్దకు పిలిచాడు. యూరియా బస్తాను తీసుకెళ్లిన యువకుడు మాట్లాడుతూ తనకు ఒకే ఒక ఎకరం వరి పొలం ఉందని, పంట చిరుపొట్ట దశకు వచ్చిందని, పది రోజులుగా యూరియా కోసం నానా కష్టాలు పడుతున్నా దొరకలేదని, పంటను దక్కించుకోవాలన్న ఉద్దేశంతోనే ఈ పని చేసినట్టు చెప్పుకుని రోదించాడు. దీంతో రామేశ్వర్‌పల్లి గ్రామస్తులు యూరియాను తీసుకెళ్లిన యువకులను సముదాయించి వదిలిపెట్టారు. నిజాయితీపరులైన యువకులు తప్పుడు పని చేయడానికి యూరియా కొరతే కారణమని ప్రభుత్వంపై రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

నూతన జీపీవోలకు విధులపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ రేణుకా చౌహాన్

గాంధారి(ఎల్లారెడ్డి): గాంధారి మండలానికి నూతనంగా 25 మంది గ్రామ పాలనాధికారులు(జీపీవో) 25 మంది నియమితులయ్యారు. 25 మంది జీపీవోలతో తహసీల్దార్ రేణుకా చౌహాన్ సమావేశం ఏర్పాటు చేసి వారి విధులపై అవగాహన కల్పించారు. వారికి కేటాయించిన గ్రామాల్లో వారి విధులు, వారు చేయాల్సిన సేవల గురించి తహసీల్దార్ వివరించారు. డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మణ్, ఆర్ఐ ప్రదీప్, సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిరోధానికి కృషి చేయాలి

కామారెడ్డి టౌన్: బాల్య వివాహాల నిరోధానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం చంద్రశేఖర్ రెడ్డి కోరారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఆయన కార్యాలయంలో సాధన సంస్థ ఆధ్వర్యంలో ప్రతిజ్ఞ చేశారు. చర్చిల పాస్టర్లు, కాంగ్రెస్ నాయకులు ప్రతిజ్ఞ నిర్వహించారు. మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ, సంస్థ ప్రతినిధులు జ్యోతి, మమత, మానస, సంధ్యారాణి,కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి

భక్తిశ్రద్ధలతో దర్గా ఉత్సవాలు



దర్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): గోపాల్‌పేటలోని పీరానే పీర్ ఆజం దస్తగీర్ హజ్రత్ సయ్యద్ అబ్దుల్ ఖాదర్ జిలాని దర్గా ఉత్సవాలను ఖాన్ ఖాయే ఆబిదుల్ హాష్మీ పీఠాధిపతి హజ్రత్ మహ్మద్ షరీఫొద్దీన్ షత్తారీ ఉల్ ఖాద్రి ఆధ్వర్యంలో సోమవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దర్గా వద్ద ఖురాన్‌ను పఠనం చేసి ఉత్సవాలను ప్రారంభించారు. అనంతరం గంధం, చాదర్‌ను దర్గాకు సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఖవాలీ కార్యక్రమాన్ని నిర్వహించారు.

పెద్దమ్మ ఆలయ కమిటీ ఎన్నిక

లింగంపేట(ఎల్లారెడ్డి): పర్మళ్ల గ్రామానికి చెందిన పెద్దమ్మ ఆలయం కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బద్ద ప్రభురాజు, ఉపాధ్యక్షులుగా కొడబోయిన రాజు, జగతి రంజిత్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా ఈర్ల పద్మరావు, కోశాధికారిగా ఈర్ల చిరంజీవి, సలహాదారులుగా దుర్గేష్, సాయిబాబు, బాల్‌రాజు, సురేష్‌లను ఎన్నుకున్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

నిజాంసాగర్(జుక్కల్): జుక్కల్ మండలం కండేబల్లూర్ గ్రామంలోని పేకాట స్థావరంపై సోమవారం సాయంత్రం ఎస్సై నవీన్‌చంద్ర ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేశారు. పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని, వారి వద్ద నుంచి రూ. 11,420 స్వాధీనం చేసుకున్నారు. గ్రామాల్లో ఎక్కడైనా పేకాట ఆడితే తమకు సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో రెండు రోజుల జైలు

భిక్కనూరు: మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడిన వ్యక్తికి న్యాయమూర్తి చంద్రశేఖర్ రెండు రోజుల జైలు శిక్షతోపాటు రూ.1000 జరిమానా విధించినట్లు భిక్కనూరు ఎస్సై ఆంజనేయులు సోమవారం తెలిపారు. మెదక్ జిల్లా రామాయంపేట మండల కేంద్రానికి చెందిన స్వామి మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడ్డాడు. దీంతో స్వామిని అరెస్టు చేసి న్యాయమూర్తి ఎదుట హాజరుపర్చగా రెండ్రోజుల జైలు శిక్ష విధించినట్లు తెలిపారు.

ఎల్లమ్మ ఆలయంలో చోరీ


సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన ఎల్లమ్మ ఆలయంలో ఆదివారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. గుడి తాళం పగులగొట్టి హుండీని ఎత్తుకెళ్లారు. హుండీలో సుమారు రూ.50 వేల వరకు ఉంటాయని గౌడ సంఘం ప్రతినిధులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఐఐహెచ్‌పీ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక



కామారెడ్డి టౌన్: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోమియోపతి ఫిజీషియన్స్(ఐఐహెచ్‌పీ) నిజామాబాద్ చాప్టర్ నూతన కార్యవర్గాన్ని నిజామాబాద్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలకు సంబంధించి వైద్యులతో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జిల్లా కేంద్రానికి చెందిన వైద్యుడు క్రిష్ణమూర్తి ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా సుబ్బారావు, ప్రవీణ్‌కుమార్, రాంప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా కులకర్ణి, సహాయ కార్యదర్శులుగా చిలుక శ్రీనివాస్, ఇందిరామోహన్, కోశాధికారిగా మహేశ్‌కుమార్, మహిళా సభ్యులుగా పద్మజ, పద్మావతి, సృజన, ప్రనద్విత, సలహాదారులుగా గోపీకృష్ణ, రాజశేఖర్‌రెడ్డి, రాజశేఖర్, కార్యవర్గ సభ్యులుగా రవీందర్, రుద్రశ్రీనివాస్, క్రాంతికుమార్, రజనీకాంత్‌లను ఎన్నుకున్నారు.

'హలో లంబాడీ.. చలో హైదరాబాద్'ను జయప్రదం చేయాలి



వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

కామారెడ్డి టౌన్: లంబాడీల ఆత్మగౌరవ వేదిక ఆధ్వర్యంలో ఈనెల 19న నిర్వహించే హలో లంబాడీ.. చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని లంబాడీ స్టూడెంట్ ఆర్గనైజేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ప్రకాష్ నాయక్ పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద ఆత్మగౌరవ సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలో వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రచార కార్యదర్శి రవీందర్ నాయక్, నాయకులు అర్జున్, సర్దార్, శంకర్, నవీన్, సిద్ధిరాములు తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

విద్యుదాఘాతంతో కౌలు రైతు మృతి



గాంధారి(ఎల్లారెడ్డి): మండల పరిధిలోని ముదెల్లిలో సోమవారం విద్యుదాఘాతంతో గ్రామానికి చెందిన కౌలు రైతు కర్రోల్ల సాయిలు(52) మృతి చెందినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. సాయిలు అదే గ్రామానికి చెందిన ఒకరి పొలం కౌలుకు తీసుకొని వరి పంట సాగు చేస్తున్నాడు. సోమవారం మధ్యాహ్నం సాయిలు, భార్య లలిత కలుపు తీసేందుకు పొలానికి వెళ్లారు. పొలానికి నీళ్లు పారించేందుకు సాయిలు బోరు మోటారు స్టార్టరు ఆన్ చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య లలిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, కూతురు ఉన్నారు.

రైలు కిందపడి ఆత్మహత్యాయత్నం

ఖలీల్‌వాడి: నిజామాబాద్ రైల్వేస్టేషన్‌లో రైలుకు ఎదురెళ్లి ఆత్మహత్యకు యత్నించిన యువకుడిని రైల్వే పోలీసులు కాపాడినట్లు ఎస్సై సాయిరెడ్డి తెలిపారు. సాలూరా మండలంలోని హాజీపూర్‌కు చెందిన పవన్ (28) ఇంజినీరింగ్ పూర్తి చేసి నిజామాబాద్‌లో ఉంటున్నాడు. ఆన్‌లైన్ బెట్టింగ్, మద్యానికి బానిస కావడంతో అప్పులయ్యాయి. అప్పుల బాధలు ఎక్కువ కావడంతో రైలు కిందపడి ఆత్మహత్యకు యత్నించినట్లు చెప్పారు. గాయపడిన పవన్‌ను రైల్వే పోలీసులు ఆస్పత్రికి తరలించారు.

ఇనుము చోరీ కేసులో ఒకరి అరెస్టు



నవీపేట: మండలంలోని యంచ సమీపంలో గోదావరిపై నిర్మిస్తున్న బ్రిడ్జికి వాడే ఐరన్ రాడ్లను ఎత్తుకెళ్లిన నిందితుడిని సోమవారం పట్టుకున్నట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. అనూష ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న బ్రిడ్జికి వినియోగించే ఇనుప రాడ్లను యంచ సమీపంలో నిల్వ చేశారు. యంచ గ్రామానికి చెందిన పీరాజి వ్యాకంటి కొన్ని రోజులుగా ట్రాక్టర్‌లో ఇనుమును దొంగిలించాడని పేర్కొన్నారు. దాదాపు రెండు టన్నుల ఇనుప రాడ్లను దొంగిలించినట్లు తెలిపారు. ప్రాజెక్టు మేనేజర్ పార్థసారథి ఫిర్యాదు మేరకు ఈ నెల 10న కేసు నమోదు చేసి దర్యాప్తు చేశామన్నారు. చోరీకి పాల్పడిన పీరాజి వ్యాకంటిని సోమవారం అరెస్టు చేసి, రెండు టన్నుల ఇనుప రాడ్లను రికవరీ చేశామని ఎస్సై తెలిపారు. చోరీకి ఉపయోగించిన ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్
- ప్రజావాణికి 82 దరఖాస్తులు



ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం: ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 82 ఫిర్యాదులు వచ్చాయి. వాటిలో భూ సమస్యలు, రేషన్ కార్డులు, పింఛన్‌లు, ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు సంబంధించినవి ఎక్కువగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వచ్చిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులు వెంటనే పరిశీలించి సమస్యలను పరిష్కరించడం గానీ, పరిష్కార మార్గాలు చూపడం గానీ చేయాలన్నారు. ఎప్పటికప్పుడు ఫిర్యాదులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఫిర్యాదులు పెండింగ్‌లో లేకుండా చూసుకోవాలన్నారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ చందర్, ఆర్డీవో వీణ, కలెక్టరేట్ పాలనాధికారి మసూర్ అహ్మద్, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు చేయించాలి

ఇటీవల వరదలకు ధ్వంసమైన రోడ్డుకు మరమ్మతులు చేయించాలని కోరుతూ భిక్కనూర్‌కు చెందిన గంగుల రవీందర్ ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. మండల కేంద్రంలోని గిద్ద హరిజనవాడకు వెళ్లేదారిలో ఉన్న దశనామ కుంట కట్ట రోడ్డు పూర్తిగా ధ్వంసమైందన్నారు. దీంతో రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయని తెలిపారు. అధికారులు స్పందించి శాశ్వత పరిష్కారాన్ని చూపాలని వినతిపత్రం సమర్పించారు.



గంగుల రవీందర్, భిక్కనూర్

అధికారుల కోసం ఎదురుచూపులు



బిచ్కుంద ప్రజావాణిలో పాల్గొన్న అధికారులు

బిచ్కుంద(జుక్కల్): ప్రతి సోమవారం బిచ్కుంద తహసీల్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణికి కొన్ని శాఖల అధికారులు మాత్రమే వచ్చారు. వ్యవసాయ, పీఆర్, విద్య శాఖల అధికారుల రాక కోసం రైతులు, ప్రజలు ఎదురుచూశారు. తహసీల్దార్ వేణుగోపాల్, ఎంపీడీవో గోపాల్, మున్సిపల్ కమిషనర్ ఖయ్యూం, ఎంపీవో కృష్ణ, ఏపీఎం రవీందర్ మాత్రమే ప్రజావాణిలో పాల్గొన్నారు. మిగత ఆయా శాఖల అధికారులు పాల్గొనలేదు. ప్రజావాణిలో వినతులు ఇవ్వడానికి వచ్చిన ప్రజలు, రైతులు అధికారుల రాక కోసం మధ్యాహ్నం వరకు ఎదురుచూశారు. సంబంధిత అధికారులు ఎంతకీ రాకపోవడంతో నిరాశతో వెళ్లిపోయారు.

భారతదేశాన్ని ఏకం చేసే భాష హిందీ

- ఘనంగా హిందీ భాషా దినోత్సవం



జంగంపల్లిలో పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులతో ఉపాధ్యాయులు



ఎల్లారెడ్డి మోడల్ స్కూల్లో డ్యాన్సులు..



పెద్ద ఎక్లార గురుకులంలో ..

భిక్కనూరు/ఎల్లారెడ్డి/మద్నూర్/:హిందీ భాషా దినోత్సవాన్ని జిల్లాలోని పలు పాఠశాలలు, కళాశాలలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపన్యాసం, డ్రాయింగ్, వ్యాసరచన, పాటల పోటీలు నిర్వహించి గెలుపొందిన బహుమతులు ప్రదానం చేశారు. హిందీ భాష ప్రాముఖ్యతను తెలుపుతూ విద్యార్థులు ఆటలు, పాటలు, నృత్యరూపంలో ప్రదర్శనలు నిర్వహించారు. వక్తలు మాట్లాడుతూ.. దేశంలో భిన్నమతాలు, భాషలున్నా భారతదేశాన్ని ఏకం చేసే భాష హిందీ మాత్రమేనని అన్నారు. హిందీ భాష గొప్పదనాన్ని, హిందీని సరళంగా నేర్చుకునే విధానం గురించి విద్యార్థులతో మాట్లాడారు.

ప్లేట్ల పంపిణీ

సదాశివనగర్(ఎల్లారెడ్డి): హిందీ దినోత్సవం సందర్భంగా మర్కల్ ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులకు ప్లేట్లను హిందీ భాషోపాధ్యాయుడు సహేందర్ రావు పంపిణీ చేశారు. ఈ ప్లేట్లతో పాటు పల్లీ చిక్కీలను అందజేసినట్లు తెలిపారు. హెచ్‌ఎం కిరణ్ ప్రసాద్,తదితరులు పాల్గొన్నారు.



వరదలతో రూ.6.59 కోట్ల నష్టం

- ట్రాన్స్‌కో ఎస్ఈ శ్రావణ్‌కుమార్



వెంకంపల్లిలో విద్యుత్ స్తంభాల బిగింపును పరిశీలిస్తున్న ట్రాన్స్‌కో ఎస్ఈ శ్రావణ్‌కుమార్

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): ఇటీవల జిల్లాలో కురిసిన భారీవర్షాలతో విద్యుత్‌శాఖకు రూ.6.59 కోట్ల నష్టం వాటిల్లినట్లు ట్రాన్స్‌కో ఎస్ఈ శ్రావణ్‌కుమార్ తెలిపారు. చీనూర్, వెంకంపల్లి గ్రామాల్లో జరుగుతున్న విద్యుత్ స్తంభాల ఏర్పాటు పనులను సోమవారం ఆయన పరిశీలించారు. వరదల వల్ల ముంపునకు గురై తేలిన పంటలను కాపాడేందుకు తక్షణమే మరమ్మతులు చేపట్టి విద్యుత్ సరఫరా చేయాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడారు. జిల్లాలో 589 ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం కావడంతోపాటు 864 విద్యుత్ స్తంభాలు నేలకూలాయన్నారు. కాగా ఇప్పటివరకు 350 ట్రాన్స్‌ఫార్మర్లను బిగించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించామని చెప్పారు. ట్రాన్స్‌కో డీఈఈ విజయసారథి, ఏడీఈ ప్రసాద్‌రెడ్డి, లైన్‌మెన్ సురేందర్, తాండూర్ సొసైటీ చైర్మన్ గంగారెడ్డి, సీడీసీ డైరెక్టర్ పీర్‌రెడ్డి ఉన్నారు.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకే పంపాలి



సోమేశ్వర్‌లో తరగతి గదిని ప్రారంభిస్తున్న ఎంఈవో నాగేశ్వరరావు

బాన్సువాడ రూరల్: తల్లిదండ్రులు తమ చిన్నారులను ప్రభుత్వ పాఠశాలలకే పంపాలని బాన్సువాడ ఎంఈవో నాగేశ్వరరావు అన్నారు. సోమవారం సోమేశ్వర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పూర్వ ప్రాథమిక తరగతి గదిని ప్రారంభించి మాట్లాడారు. నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీల పేరిట ప్రైవేటు పాఠశాలలకు పంపకుండా గ్రామంలోని పూర్వ ప్రాథమిక పాఠశాలకు పంపించాలన్నారు. హెచ్‌ఎం శ్రీనివాస్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ సఫీయాబేగం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తాడ్వాయి(ఎల్లారెడ్డి): బ్రహ్మాజీవాడిలో సోమవారం ప్రీప్రైమరీ తరగతులను ఎంఈవో రామస్వామి ప్రారంభించి మాట్లాడారు. కాంప్లెక్స్ హెచ్‌ఎంలు కళ్యాణి, సంగారెడ్డి, ఏఎంవో వేణుశర్మ, సీఎంవో నాగవేందర్, పాఠశాల హెచ్‌ఎం అనిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిరూరల్:తిమ్మాపూర్‌లో సోమవారం ప్రీప్రైమరీ పాఠశాలను ఎంఈవో రాజులు ప్రారంభించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ అధ్యక్షులు ఇంద్రజ,హెచ్‌ఎం అనిల్ కుమార్, ఉపాధ్యాయులు దివ్య,పంచాయతీ కార్యదర్శి జ్యోతి పాల్గొన్నారు.

మూత్రశాలకు భూమి పూజ

పెద్దకొడప్‌గల్(జుక్కల్): మండల కేంద్రంలోని పీహెచ్‌సీ ఆవరణలో సోమవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో సామూహిక మూత్రశాలకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మహేందర్ రెడ్డి మాట్లాడుతూ.. స్వచ్ఛ భారత్ మిషన్ నిధుల కింద రూ.5 లక్షల మంజూరయ్యాయని తెలిపారు. నాణ్యతతో సామూహిక మూత్రశాల పనులు చేపట్టాలని సూచించారు. ఎంపీవో సుదర్శన్, కార్యదర్శి శ్రీను, కాంగ్రెస్ పార్టీ నేతలు పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న కాంగ్రెస్ నేతలు